# భూమి గుండ్రంగానే ఉంది నిర్ఝుం!

"నాథా! పాపం మీ భక్తుడు లింగయ్య ఎన్ని తిప్పలు పడుతున్నాడో? ఇకనైనా అతని కష్టాలు కడ తేర్చరా?" పార్వతీదేవి శంకరున్ని వేడుకొంది.

"పిచ్చి పార్వతీ! బ్రహ్మ రాతను మార్చగలనా?"

"అదేమిటి స్వామీ, మీకది అసాధ్యమా?"

"అవును, బ్రహ్మ రాతను మార్చడం బ్రహ్మకు కూడా సాధ్యం కాదు. నీ కోరిక మేరకు, లక్షలు చేసే మణిని లింగయ్యకు ప్రసాదిస్తాను. ఏమౌతుందో చూడు."

పొలం పని నుండి వస్తుండగా ధగధగ మెరిసే మణి లింగయ్యకు దొరికింది. ఏదో మెరిసే రాయి కదా అనుకుని దాన్ని కోమటి చెంచయ్యకు ఇచ్చాడు. అది చూడగానే చెంచయ్య కళ్ళు చెదిరాయి. కాని కోమటి కదా! లౌక్యంగా లింగయ్యను ముగ్గులోకి దించాడు. నమ్మించి, బదులుగా లింగయ్యకు రెండు కిలోల బియ్యం, అరకిలో పప్పు అంటగట్టాడు.

లింగయ్య సంతోషానికంతు లేదు. ఎన్నో రోజుల తర్వాత అతని కుటుంబం కడుపునిండా భోంచేసింది. మరునాడు లేచింతర్వాత? షరా మామూలే!

"చూశావా పార్వతీ! మనం అనుకున్నా కొందరి నొసటి రాతను మార్చలేము? పద ముంబాయి వెళదాం. అక్కడి "సావంత్ చాల్"లో ఏమౌతుందో తిలకిద్దాం."

* * *

"సోదర సోదరీమణులారా! తమ ఎన్నిక నివేదికలో పేర్కొన్నట్టుగా, ఈ కొత్త ప్రభుత్వం, మనలాంటి గుడిసెల్లో ఉండేవారికి పక్కా ఇళ్లు కట్టి ఇవ్వడానికి గట్టి ప్రణాళిక తయారుచేసింది." మీటింగులో చాల్ కమిటీ సెక్రటరీ పరబ్ మాస్తర్ మరాఠీలో ప్రసంగిస్తున్నాడు.

"మన నలభై అయిదు గుడిసెల జాగాలో రెండు బిల్డింగులు కడతారు. ఒక బిల్డింగులో మనందరికి ఫ్లాట్లు ఇస్తారు. అంటే ఇప్పుడున్న మన వంద చదరపు అడుగుల గదులకు బదులుగా రెండు వందల చదరపు అడుగుల ఫ్లాట్లు – హాలు, వంటగది, బాత్రూము, లెట్రిను మొదలు హంగులతో కట్టి ఇస్తారు. ఇప్పుడు రెండు లక్షల ఖరీదు చేసే ఈ గుడిసెకు బదులుగా, దాదాపు పది లక్షలు విలువచేసే ఫ్లాటు మనదౌతుంది."

"మీరు చెప్పడం, మేము వినడం, ఇలా అయిదు సంవత్సరాల నుండి జరుగుతోంది. వంద నెలల బాడుగలు కోర్టులో కట్టాం. ఏమీ లాభం లేదు. మాకైతే ఇవన్నీ ఊకదంపుడు కబుర్లనిపిస్తున్నాయి." ఉపాధ్యక్షుడు భూమయ్య మధ్యలో అందుకున్నాడు. సాంబన్న వంతపాడాడు.

భూమయ్య, సాంబన్న "సావంత్ చాల్" నివాసులు. సావంత్‌చాల్ నగర నడిబొడ్డున పరేల్‌లో ఉంది. అది బడుగు జీవుల గూడు. సాంబన్న తాపీ పని మేస్త్రీ.

భూమయ్యకు టైలర్ షాపుంది. నలభై అయిదు గుడిసెల ఆ చాల్‌లో 20 తెలుగు కుటుంబాలు ఉన్నాయి. వారిళ్లలో మగవారు చిన్నా చితకా పనులు చేస్తే, ఆడవారు బీడీలు చేస్తారు. దాంతో ఈ ముంబయిలో జీవితం సాగుతోంది. కొంత వెనకేసుకుంటారు కూడా.

అంతరాయానికి పరబ్ చిరాకు పడ్డాడు.

"నన్ను పూర్తిగా మాట్లాడనీయండి. ఆ తర్వాత మీ ధర్మ సందేహాలు తీరుస్తాను. మనం ఇంతవరకు సాధించింది ఒక ఎత్తు. ఇకముందు సాధించబోయేది ఒక ఎత్తు. ఇన్నేళ్ల మన కృషి ఫలితంగా మన "హౌసింగ్ సొసైటీ" రిజిస్టరయింది. వంద బాడుగలు తీసుకుని, చాల్ ఓనర్ కూడా ఒప్పందానికొచ్చాడు. పథకం పటిష్ఠంగా రూపొందించాం. మనం ఊఁ అంటే, వచ్చే సంవత్సరం ఈపాటికి మన సొంత ఫ్లాటులో ఉండవచ్చు. "మల్కానీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్" వారి ప్రతినిధి శ్రీ తేవానీగారు మిగతా వివరాలు చెబుతారు."

"శ్రీ పరబ్‌గారు చెప్పినట్లుగా, మీకందరికీ రెండు వందల చదరపు అడుగుల ఫ్లాటు, మీకు ఏమాత్రం ఖర్చులేకుండా కట్టి ఇవ్వడానికి మా ప్రొప్రైటర్ సమ్మతించాడు. మీ సౌకర్యం కోసం ప్రభుత్వం నిర్దేశించిన దానికన్నా 20 చదరపు అడుగులు అదనంగా కట్టి ఇస్తున్నాము."

"దీంట్లో మీ స్వార్థం లేదా?" నామ్‌దేవ్ పాటిల్ అడిగాడు.

"ఎందుకు లేదు? ఉంది. లోకంలో స్వార్థం లేనిదెవరికి? మీరు ఖాళీ చేసిన స్థలంలో పదహారు అంతస్థుల బిల్డింగు కడతాం. ఆ ఫ్లాట్లు ఎక్కువ ధరకు అమ్ముకుంటాం. వచ్చే లాభంలో మీ వాటాగా, మీలోని ప్రతివారికీ ఇప్పటికి రెండింతల స్థలం, అన్ని హంగులతో సమకూరుస్తాం. అంటే మనందరి స్వార్థం అన్నమాట" తేవానీ నవ్వుతూ జవాబిచ్చాడు.

"మాలో కొందరు ఒప్పుకోకుంటే?"

"అందరూ ఒప్పుకుంటేనే పథకం సఫలం అవుతుంది. మామాట నమ్మనివారికి మూడు లక్షలు ఇస్తాం. ఖాళీ చేయండి. మా పేర వాటిని రాసియ్యండి. గుడిసె మా పేర రాసి మూడు లక్షలో లేక ఫ్లాటు సొంతం చేసుకుంటారో తేల్చుకోండి."

తర్జన భర్జనల తర్వాత, సాంబన్న లాంటి పదిహేనుమంది మూడు లక్షలకు ఓటు వేసారు. భూమయ్య లాంటి మిగతా ముప్ఫై మంది ఆశావాదులు, పదిలక్షల ఫ్లాటు వైపు మొగ్గు చూపారు.

పొదలోని మూడు పక్షులకంటే చేతిలోని ఒక పక్షే నయమా? కాలమే జవాబు చెప్పాలి.

అయితే కథ ఇంతటితో అయిపోలేదు. సాంబన్న నగర శివార్లలోని బోరీవలీలో ఇంకో గుడిసెకు మారాడు. దానికి ఒక లక్ష, కూతురు పెళ్లితో మరో లక్షకు కాళ్లొచ్చాయి. మిగతా లక్ష తాగుడు, తినుడు, జూదం, మట్కా, వీటి హారతిలో కర్పూరం అయింది.

భూమి గుండ్రంగానే ఉంది. నిర్ఘుం! ఇదంతా చూసి బోళాశంకరుడు మందహాసం చేసాడు. పార్వతీదేవి ఉడుక్కుంది.